## 12

# తేలిన ఫలితార్థమిదే

## (ప్రసంగి 11; 12)

సొలొమోను కనుగొన్నవాటిని, సొలొమోను పరిశీలనగా చూచినవాటి సంగ్రహమును మనం చూడడానికి యిప్పుడు సిద్ధంగా ఉన్నాం. అతడు ప్రతి దానిని పరిశీలనగా చూచాడు – తప్పొప్పుల రీతిలో అనుభవాన్ని గడించాడు – ఏది ముఖ్యమో – ఏది ముఖ్యము కాదో చూచాడు.

క్రమబద్ధంగాను, శాస్త్రీయంగాను, సంతోషాన్ని అన్వేషించడానికి మనం పూనుకున్నాం. జీవితము క్షీణించిపోతుండగా, తన ఫీలింగ్స్‌ను బయలుపరచడానికి అతడు పరిశోధనా రిపోర్టును తయారు చేశాడు. సొలొమోను దినాలనుండి ప్రజలు ఆలాటి పరిశోధనలే చేశారు. ఆలాటి తీర్మానాలకే వచ్చారు – కాని వీటిలా ఏదియు బాగా నిరూపణ కాలేదు లేక వీటిలా స్ఫూర్తిని కలిగించలేదు. సొలొమోను మాటలు నిరంతరమైనవి. ఇంకా పదిలక్షల సంవత్సరాలు ఈ లోకం కొనసాగితే, ఆరంభంనుండి ఎలాగో అప్పటివరకును అతని మాటలు అలాగే నిజమైనవిగాను, ప్రయోజనకరమైనవి గాను ఉంటాయి.

జీవితపు ప్రశ్నలకు జవాబులు దేవునియందు కన్పిస్తున్నాయని నిస్సందేహంగా ప్రకటన 11, 12 అధ్యాయాలు తెలుపుతున్నాయి. భూమియు దాని సంపూర్ణతయు ... యెహోవావే (కీర్తన 24:1). మనమందరము దేవునిచే సృష్టింపబడ్డాం. మనమిక్కడ ఎందుకున్నామో తెలిసికొనగోరితే, సొంతగాని పుస్తకమైయున్న బైబిలును సంప్రదించాలి.

### దేవుని మీద ఆనుకో (11:1-6)

11వ అధ్యాయం యిలా ఆరంభమౌతుంది: “నీ ఆహారము నీళ్లమీద వేయుము, చాలా దినములైన తరువాత అది నీకు కనబడును” నీళ్లమీద ఆహారం చల్లడం అర్థరహితం. అది కేవలం కొద్ది సెకండులు తేలి, తరువాత శాశ్వతంగా అదృశ్యమౌతుంది. నీళ్లలోనికి ఆహారము చిమ్మినందున వచ్చే లాభమేమి? సొలొమోను సరిగా ఉదహరించేది అదే – కొన్ని మంచి పనులు ఎంత పనికిరానివిగా ఉంటాయంటే, వాటిని చేయడానికి ఏ హేతువు కన్పించదు. మనం చేసేవాటి ఫలితాన్ని మనం నిత్యం చూడలేం. ఫలితాలను కొలవడానికి మనకు చేతకాదు, ఎందుకంటే మన క్రియలను దేవుడు ఎలా ఉపయోగిస్తాడో మనకు తెలియదు. దేవుడు ఎలా పనిచేస్తాడనేది మనకు అర్థం కాదు. “నేను నాటితిని అపొల్లో నీళ్లు పోసెను; వృద్ధి కలుగజేసినవాడు దేవుడే” (1 కొరింథీ. 3:6). మనం దేవుని కొరకు పని చేస్తున్నట్టయితే, అది నిరుపయోగంగా కన్పించినా, కట్టకడకు మనం ఫలితాలను కోస్తాం.

తరువాత, "ఏడుగురికిని ఎనమండుగురికిని భాగము పంచిపెట్టుము, భూమిమీద ఏమి కీడు జరుగునో నీవెరుగవు" అనే హితవును మనం కనుక్కొంటాం (11:2). "ఏడు," "ఎనిమిది" అనేవి నిశ్చయము కాని అంకెలు – "ఎంతమంది ఉంటే అంతమందికి" అని వాటి అర్థం. మనం చేయగల మేలంతటిని చేయాలి, ఎందుకంటె మనకు సహాయం ఎప్పుడు కావాలో మనకే తెలియదు. ప్రకృతి గమనాన్ని మనం మార్చలేం "మేఘములు వర్షముతో నిండియుండగా అది భూమిమీద దాని పోయును" (11:3). ఎక్కడ చెట్టు పడిపోతుందో మనకు తెలియదు. పిడుగు దాన్ని కొట్టవచ్చు, లేదా గాలియే వ్రేళ్లతో కూడ దాని పెకిలింపవచ్చు. ఎక్కడ అది పడిపోతుందో అక్కడనే అది నిలిచియుంటుంది (11:3). మన స్వాధీనంలో లేని ప్రకృతి సంభవాలు ఏ సమయములోనైనా మనలను ఏ అవసరతలోనైనా దింపవచ్చు.

ఆది క్రైస్తవులు తమ చర, స్థిరాస్తులను అమ్మి అపొస్తలుల పాదాల దగ్గర వాటిని పెట్టేలా వారిని నడిపించిన స్వభావము యిదే (అపొ. 2:44, 45; 4:32-37). ఇచ్చినవారు అవసరతలోనికి వచ్చినట్టయితే, వారు యితరుల చేత సహాయం చేయ బడతారు. ఇది దేవుని జీవిత భీమా పథకం.

ప్రకృతి నియమం మీద అత్యధికమైన నమ్మకం పెట్టుకున్నవారు ఎన్నడు ఏమియు చేయకపోవచ్చు. గాలిమీద ఎక్కువ శ్రద్ధపెడితే, మనం విత్తనాలు విత్తకపోవచ్చు. మేఘాలు కమ్ముకొని వచ్చాయంటే వర్షం వస్తుందనే భయంతో కోతకోయకపోవచ్చు. ప్రకృతి వైపరీత్యాలను నిర్లక్ష్యం చేయడం అవివేకమౌతుంది. అదే సమయంలో, కష్టాలు ఎదురౌతాయనే భావమే అత్యధికమైతే, ఏమీ సాధించలేకుండ మనం నిరాశపడవచ్చు.

జీవితంలో సంభవించేవి అన్నీ మనకు తెలియదు (11:5). శిశువు జన్మించకముందు తల్లి గర్భంలో మానవ ఆత్మ పనిని గాని, చూలాలి గర్భంలో ఎముకలు ఎదిగే విధానంగాని మనకు తెలియదు. వీటిని జరిగించే దేవుని కార్యాలను కూడా మనం ఎరుగలేం. గ్రహింపులేమి మన పనిని ఆటంకపరచకుండ చూచుకోవాలి.

దేవునియందు నమ్మికయుంచి మన కృషిని కొనసాగించాలి. ఉదయాన ఎంత శ్రద్ధతో ప్రారంభిస్తామో, సాయంకాలాన అదే శ్రద్ధతో శ్రమిస్తాం. ఏది ఫలించునో మనకు తెలియదు. మన ప్రయాసను దేవుడు ఆశీర్వదించునట్టు మనమాయనమీద ఆధారపడాలి. ఉదయం విత్తినది ఎంత ఫలభరితంగా ఉంటుందో సాయంత్రం విత్తినది కూడా అంతే ఫలభరితంగా ఉండవచ్చు (11:6).

## నేడు యెహోవాయందు ఆనందించు (11:7-10)

జీవితాన్ని అనుభవించడం అద్భుతం (11:7, 8). "సూర్యుని చూడడం" అనే ప్రయోగం సాధారణంగా, "జీవితాన్ని అనుభవించడం" అనే అర్థంతో ఉపయోగించబడుతుంది. "సూర్యుని క్రింద" అనే ప్రయోగం సొలొమోను పదే పదే చేశాడు. "జీవితకాలం" అనే భావనను అందు సూచించినట్టున్నాడు. వెలుగును చూచే క్షణాలు, భూమిమీద బ్రతికే రోజులు. ఇలా చెప్పడం సొలొమోను విధానం, "బ్రదికియుండడం మంచిది."

మనము బ్రదుకు కాలమంతటిలో ప్రతిదినము సంతోషంగా ఉండాలని 8వ

వచనంలో మనం చెప్పబడ్డాం. మనం ఒక రోజు చూస్తామనే జ్ఞాపకం జీవితంలోనుండి ఎక్కువ మేలును పొందేలా మనలను ప్రోత్సహిస్తుంది. "చీకటి దినములు" సమాధిలో ఉండే దినాలను సూచించవచ్చు (9:10). ఈ జీవితకాలంతో పోల్చితే నిత్యత్వము బహు దీర్ఘమైనది 12:5లో "నిత్యమైన ఉనికి పట్టు" అని సొలొమోను సూచించేది శరీరాన్ని విడిచి వెళ్లడాన్ని గూర్చి కావచ్చు. మనం మరణిస్తామనే గ్రహింపు ఈ జీవితాన్ని సంపూర్ణంగా సద్వినియోగం చేసికొనేలా నడిపిస్తుంది. ఎలా చనిపోవాలో నేర్చుకునే వరకు నిజంగా మనం ఎలా జీవించాలో ఎరుగలేమని ఇది తిరిగి నొక్కి చెప్పుతుంది.

తరువాత మనం యిలా చదువుతాం: "యౌవనుడా నీ యౌవనమందు సంతోష పడుము, నీ యౌవనకాలమందు నీ హృదయమును సంతుష్టిగా ఉండనిమ్ము" (11:9). ఇంతకు సొలొమోను అంటుందేమంటే, "నీవు యౌవనుడవైనందుకు సంతోషించు, నీవు ఈ జీవితాన్ని అనుభవించాలని దేవుడు కోరుతున్నాడు. సంతసించు హృదయాన్ని కలిగియుండు. నీ చుట్టునున్న సద్విషయాలకు నీ కన్నులు తెరువు. అయితే సంతోషించ డానికి పాప భోగము మార్గమని నమ్మి మోసపోకు. నీ చర్యలన్నిటికి దేవుని ఎదుట లెక్క చెప్పవలసియుందని గుర్తుంచుకో."

జీవితాన్ని అనుభవించడమంటే పాపపు భోగాల్లో పొర్లాడడమని అర్థం కాదు (హెబ్రీ. 11:25) ఆనందదాయకమైన జీవితం ద్వారా మన హృదయాల్లోనుండి దుఃఖాన్ని తొలగించుకోమని ఆయన కోరుతున్నాడు. దేహాన్ని చెరుపు దానిని తొలగించుకోవాలని ఆయన సెలవిస్తున్నాడు. ఆనందదాయకమైన జీవితం – నీతి జీవితం. పాప భోగాలలో పడి ఆనందదాయకమైన జీవితానికి ప్రయత్నించడం వ్యర్థం.

## నీ యౌవన కాలమందే దేవుని స్మరణకు తెచ్చుకొనుము (12:1-8)

వృద్ధాప్యానికి ముందే ఆరంభించినట్టయితే, మనం దేవుని ఎక్కువగా మహిమ పరచే వీలుంటుంది "దుర్దినములు రాకముందే – ఇప్పుడు వీటియందు నాకు సంతోషము లేదని నీవు చెప్పు సంవత్సరములు రాకముందే ... నీ బాల్యదినములందే నీ సృష్టికర్తను స్మరణకు తెచ్చుకొనుము" అని సొలొమోను రాశాడు (12:1). వృద్ధాప్యంలో, ప్రత్యేకించి దేవుడు లేకుండ – జీవితాన్ని అనుభవించడం కష్టం. దేవుడు లేకుండా వృద్ధాప్యంవరకు బ్రతికినవారిలో ఎక్కువమంది ఆయన లేకుండానే చస్తారు. ముసలితనంవరకు నెట్టుకొంటూ పోయాక, అప్పుడు దేవునివైపు మరలడం కష్టం. ఎంత వృద్ధుడైతే, క్రీస్తులోనికి మార్చడం అంత కష్టమని అందిన లెక్కలు చెప్పుతున్నాయి. లోకమంతటిలో, సువార్త ఎక్కడ ప్రకటింపబడిందో, అక్కడెల్లా యువకులు ఎక్కువగా అంగీకరించినట్టుంది.

ముసలితనంలో జనులు దేవుని వైపు తిరగడం ఎందుకు తక్కువౌతుంది? ముసలి తనపు పరిణామాలను గూర్చి 2నుండి 7 వచనాలవరకు రూపకాలంకారంలో మనం కనుగొంటాం.

తేజస్సునకును సూర్యచంద్ర నక్షత్రములకును చీకటి కమ్మకముందే, వాన వెలిసిన తరువాత మేఘములు మరల రాకముందే, నీ బాల్యదినములందే నీ సృష్టికర్తను స్మరణకు తెచ్చుకొనుము. ఆ దినమున ఇంటి కావలివారు వణకుదురు బలిష్ఠులు వంగుదురు, విసరువారు కొద్దిమంది యగుటచేత పని చాలించుకొందురు, కిటికీలలో గుండ చూచు వారు కానలేకయుందురు. తిరుగటిరాళ్ల ధ్వని తగ్గిపోవును, వీధి తలుపులు మూయబడును, పిట్టయొక్క కూతకు ఒకడు లేచును; సంగీతమును చేయు స్త్రీలు, నాదముచేయు వారందరును నిశబ్దముగా ఉంచబడుదురు. ఎత్తు చోటులకు భయపడుదురు. మార్గములయందు భయంకరమైనవి కనబడును, బాదము వృక్షము పువ్వులు పూయును, మిడుత బరువుగా ఉండును, బుడ్డబుడుసర కాయ పగులును, ఏలయనగా ఒకడు తన నిత్యమైన ఉనికి పట్టునకు పోవుచున్నాడు. వాని నిమిత్తము ప్రలాపించువారు వీధులలో తిరుగుదురు. వెండి త్రాడు విడిపోవును, బంగారు గిన్నె పగిలిపోవును, ధారయొద్ద కుండ పగిలి పోవును, బావియొద్ద చక్రము పడిపోవును. మన్నయినది వెనుకటివలెనే మరల భూమికి చేరును, ఆత్మ దాని దయచేసిన దేవుని యొద్దకు మరల పోవును”

ముసలితనములో, ఇంద్రియములన్నీ మందగిలుతాయి. చేతులు (యింటి కావలివారు) వణకనారంభిస్తాయి, కాళ్లు (బలిష్ఠులు) వంగుదురు. పండ్లు (విసరువారు) కొన్ని రాలిపోవడంవలన పని చాలించుకుంటాయి, కండ్లు (కిటికీలలో గుండ చూచువారు) కానలేకయుందురు. ఒకప్పటివలె మెదడు ఆజ్ఞలకు ప్రతిచర్య జరుపలేని పరిస్థితికి శరీరం వచ్చి చేరుకుంటుంది. దేవునికొరకు జీవించడానికి వృద్ధులు తరచుగా నిరాశచెందిన వారై యుంటారు. దేవుడు లేకుండగానే వారి శ్రేష్ఠమైన సంవత్సరాలు గడిసినట్టు వారు తలంచుతుంటారు. దేవునికి సమర్పించడానికి వారికి ఎక్కువ సమయంగాని బలంగాని లేదని వారు భయపడతారు. తమ్మును క్షమించి అంగీకరించమని తమ ముసలితనంలో దేవుని వేడుకొనడం సరికాదని వారు నమ్ముతారు. అది నిజం కాదనుకో, యువకులో, ముసలివారో యథార్థ హృదయంతో మారుమనస్సు పొంది ఆయనకు లోబరచుకునేవారిని క్షమించి అంగీకరించడానికి దేవుడు ఎల్లవేళ్లలా సిద్ధంగా ఉన్నాడు.

వృద్ధాప్యం మీదపడుతున్నవాని గూర్చి సొలొమోను చిత్రించుకొంటూ వెళ్లుతున్నాడు. చెవులు వినుటకు మందములౌతాయి (వీధి తలుపులు మూయబడ్డాయి) ముసలివారు ఎంత తక్కువగా నిద్రిస్తారంటే, (పిట్టయొక్క కూతకు ఒకడు లేచును) ఏ చిన్న శబ్దమైనా అతని మేల్కొనజేయును గాత్రము రాగమయత్వాన్ని కోల్పోతుంది (సంగీతమును నాదము చేయువారు నిశ్శబ్దముగా ఉంచబడుదురు). వయస్సు అధికమవ్వడంతో (ఎత్తు చోటులకు భయపడుదురు) తలవెంద్రుకలు తెల్లబారతాయి (బాదము వృక్షము పువ్వులు పూయును) తాను యిక మీదట అధికమైన బరువులు ఎత్తలేడు. తన దేహమే తనకు బరువుగా ఉంటుంది. (మిడుత బరువుగా నుండును) అతని భౌతికమైన వాంఛలు తగ్గిపోతాయి (బుడ్డబుడుసరకాయ పగులును). అతడు తన నిత్యమైన నివాసమునకు వెళ్లుతున్నాడు. వాని నిమిత్తము ప్రలాపించువారు వీధులలో తిరుగుదురు.

12:6లో మరణము రెండు చిత్రాలుగా ఉదహరించబడింది; “వెండి త్రాడు విడిపోవును, బంగారు గిన్నె పగిలిపోవును, ధారయొద్ద కుండ పగిలిపోవును, బావియొద్ద చక్రము పడిపోవును” దీనికి ముందు ఆయనను జ్ఞాపకము చేసికో. జీవితమనే వెండి

త్రాడు విడిపోయినప్పుడు, దీపము పడిపోయి పగిలిపోతుంది. మరొక చిత్రంలో చక్రము పడిపోయింది, ధారయొద్ద కుండ పగిలిపోయింది. మన్నయినది వెనుకటివలెనే మంటికి చేరును (ఆది. 2:7), "ఆత్మ దాని దయచేసిన దేవుని యొద్దకు మరల పోవును" (12:7, 8) దేవుని కొరకు మనం ఏమి చేయ సంకల్పించినా, ఆ సమయానికి ముందుగానే మనం చేయాలి. నిత్యత్వం కొరకు మనం ఏ విధమైన సిద్ధపాటు చేసికొన్నా, దానికి ముందే జరగాలి. ఆ సిద్ధపాటును అలక్ష్యం చేసే జీవితం చివరి లెక్కల ప్రకారం పనికిరానిదియు వ్యర్థమైనదియునైయుంది.

## సత్యాన్ని గుర్తించు (12:9-14)

తన పోరాటమంతటితో, ప్రసంగియైన సొలొమోను, తన జ్ఞానాన్ని యితరులతో పంచుకోగలిగాడు. తన జనులకు ఉపదేశించడానికి అతడు అనేక సామెతలను పొందుపరచాడు. సత్యము, అనే నీతి తన మాటలను అందించడానికి సరియైన మార్గాన్ని వెదకాడు (12:9, 10).

జ్ఞానులు చెప్పుమాటలు ములుకోలలవలెను చక్కగా కూర్చబడి బిగగొట్టబడిన మేకులవలెను ఉన్నవి (12:11). ములుకోల కాడెద్దులను తోలడానికి వినియోగించే కర్ర. తమ ఉపదేశకులచే చక్కగా నాటించబడిన మేకులవలె ఉన్నాయి.

తాను విని నేర్చుకున్న హితోపదేశాన్ని శ్రద్ధగా సొలొమోను తన కుమారునికి హెచ్చరిక చేశాడు (12:12). సంగతులు తెలిసినవారని చెప్పుకునేవారివలన అంతము లేని అభిప్రాయాలు చెప్పబడతాయి. వాటిని పఠించి ఏది సత్యమో తేల్చుకొనడం ఆయాసాన్ని కలిగించవచ్చు. సత్యముకానిది ఏదియు జ్ఞానం కాదు.

తన జ్ఞానమంతటితో, అనేక సంవత్సరాలు జీవితపు అర్థాన్ని కనుగొనడానికి సొలొమోను ప్రయాసపడ్డాడు. ప్రసంగి అంతములో అతడిలా రాశాడు: "ఇదంతయు వినిన తరువాత తేలిన ఫలితార్థమిదే. దేవునియందు భయభక్తులు కలిగియుండి ఆయన కట్టడల ననుసరించి నడుచుచుండవలెను, మానవ కోటికి ఇదియే విధి. గూఢమైన ప్రతి అంశమును గూర్చి దేవుడు విమర్శ చేయునప్పుడు ఆయన ప్రతి క్రియను, అది మంచిదేగాని చెడ్డదేగాని, తీర్పులోనికి తెచ్చును" (12:13, 14).

## ముగింపు

సొలొమోను తీర్మానమే మన తీర్మానమైయుండాలి: "దేవునియందు భయభక్తులు కలిగియుండి ఆయన కట్టడల ననుసరించి నడుచుచుండవలెను." ఇంతకు జీవితమంటే అదే! మన జీవితాలు ఆయన కొరకు బ్రదికి, తీర్పుకొరకు సిద్ధంగా ఉండుటయే జీవితమంతటిలో జ్ఞానయుక్తమైన మార్గం (మత్తయి 25:31–46). అవి మంచివైనా చెడ్డవైనా, రహస్యంగా జరిగించినవైనా మనం దేవునికి లెక్క చెప్పవలసియుంది. దేవుడు "యేసు క్రీస్తు ద్వారా మనుష్యుల రహస్యములను విమర్శచేస్తాడని పౌలు ఆ దినాన్ని గూర్చి మాట్లాడాడు" (రోమా 2:16). ఆ దినము వచ్చినప్పుడు, దేవునికి భయపడి ఆయన కట్టడలననుసరించినడుచుకొనువారు ఆనందించడానికి హేతువుంటుంది (1 పేతురు 4:13).